క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: రోజురోజుకు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలలో వ్యాపారులు, సామాజిక సంఘాలు, క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వాసవిక్లబ్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో 30 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 29వ రోజు పంపిణీ కొనసాగింది. గోకవరపు హరికృష్ణ ప్రసాద్ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు టీవీ సుబ్బారావు మాట్లాడుతూ వేసవి తాపం తగ్గేవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఎక్కలి మణిదీప్, ఎం.గంగాధరరావు పాల్గొన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 19వ రోజు మజ్జిగ పంపిణీ కొనసాగింది. కార్యక్రమంలో జి ప్రభాకరరావు, ఎంవీ సత్యనారాయణ, పి వెంకట్, మరడాని చంద్రశేఖర్, వంగపండు బాబు, మూడెడ్ల ఉమ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు



గుడివాడ టౌన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు–2023 శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవైఈఓ సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 1,409 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,014 మంది 19 సెంటర్లలో పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షణలో పగడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఎంపీపీ స్కూల్-2ను సందర్శించిన ఈడీ



మండవల్లి: స్థానిక ఎంపీపీ స్కూల్–2ను బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎస్.పుష్పలత శుక్రవారం సందర్శించారు. జగనన్న విద్యా కానుక–4 కిట్లను పరిశీలించారు. జూన్ 12వ తేదీ స్కూల్ తెరిచే నాటికి జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఎంఈఓకు సూచించారు. విద్యాశాఖాధికారి కె.నరేష్‌కుమార్, పీఆర్ ఏఈ ఫణి వెంకట పూజిత, హెచ్‌ఎం బెన్నీపాల్, జేవీకే–4 విద్యాకమిటీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం అనర్థం



చల్లపల్లి: పర్యావరణానికి పెను నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించవద్దని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం సాయంత్రం మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా డీపీఓ ఆదేశాల మేరకు గుడివాడ కళాభారతి బిళ్లపాడు కళాకారుల బృందం వారు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అనర్థాలను కళాకారులు ప్రదర్శన ద్వారా వివరించారు. ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, గ్రామ సచివాలయ మహిళా పోలీస్ లావణ్య, కళాకారులు శేఖర్ బాబు, దేవ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి, గౌరవ మర్యాదలు

మచిలీపట్నంటౌన్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యావంతులకు సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయని ఆదివెలమ శ్రేయోభివర్ధిని సంఘం అధ్యక్షుడు పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బలరామునిపేటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదవడం ద్వారానే మంచి ఉద్యోగం పొందటంతో పాటు సమాజంలో గౌరవం పొందగలుగుతారన్నారు. చదువు లేకుంటే జీవిత లక్ష్యాలను సాధించలేమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాదిరెడ్డి ఆంజనేయులు, హరినాథ్, బాబ్జీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పథకాల అమలుతో గడప గడపలో ఆనందం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో గడప గడపలో ఆనందం నెలకొందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని హనుమంతపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అని ఆరా తీశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు గడప వద్దకే అందుతున్నాయన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ మహేష్, సర్పంచ్ కలపాల రాంబాబు, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి గంగరాజు, అక్కినేని సతీష్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, నాయకులు మస్తాన్‌రావు, చంద్రపాల్ పాల్గొన్నారు.



హనుమంతపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఇంటి నిర్మాణాలకు రూ.2 లక్షల రుణం

కైకలూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహాలకు కేడీసీసీ బ్యాంకు ద్వారా ఒక్కొక్క లబ్ధిదారులకు రూ.2 లక్షలు వ్యక్తిగత రుణం అందిస్తున్నామని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. కైకలూరు కేడీసీసీ బ్యాంకు మేనేజరును శుక్రవారం కలిసి రుణాలు కేటాయింపు వేగవంతం చేయాలని కోరానన్నారు. లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలన నిమిత్తం డిగ్రీ చదివిన కొందరు విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. త్వరలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), జిల్లా కలెక్టరు సమక్షంలో మేగా రుణా మేళాను కైకలూరులో నిర్వహిస్తామన్నారు. అనంతరం రూ.12 లక్షలతో ఆచవరం తాగునీటి పథకం నుంచి ఆనందరావుపేట గ్రామానికి పూర్తి చేసిన తాగునీటి పైపులైను పనులను ఎంపీపీ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్ రఫీ, కాంట్రాక్టరు తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కేడీసీసీ బ్యాంకు వద్ద డిగ్రీ చదివిన విద్యార్థులతో ఎంపీపీ అడవి కృష్ణ

సమయపాలన పాటించాలి

ముదినేపల్లి రూరల్: పీహెచ్‌సీ, సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి కోరారు. మండలంలోని దేవపూడి పీహెచ్‌సీ, గ్రామ సచివాలయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో సక్రమంగా అందించేందుకు వీలుంటుందని తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారి నుంచి అందుబాటులో ఉన్న మందుల వివరాలు సేకరించారు. ప్రాథమిక చికిత్సకు అవసరమయ్యే మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ రోజూ మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి స్థానికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.



దేవపూడి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

వలంటీర్ల సేవలు అభినందనీయం



అవార్డులు పొందిన వలంటీర్లతో అధికారులు, ప్రజాప్రతినిధులు

గుడివాడ టౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్(అల్లంబడి)లో 30, 31, 32, 33, 34, 35 వార్డు సచివాలయాల్లో అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహరావు, నాయకులు ఎం.చిన నారాయణరెడ్డి, సింగిరెడ్డి గగారిన్, నారాయణరెడ్డి, గొర్ల రమణ, భాగ్యశ్రీ పాల్గొన్నారు.



నాగరత్నానికి పింఛను అందించిన వలంటీర్ ఉష

పనితీరు ఆదర్శనీయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరుకు చెందిన దివ్యాంగుడు మన్నలూరి నాగరత్నం అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఒక హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. తన సొంత ప్రయాణ ఖర్చులతో వలంటీర్ ఉష శుక్రవారం విజయవాడకు వెళ్లి పింఛనుదారునకు రూ.3వేల పింఛనును అందించారు. ఆ లబ్ధిదారుని మన్ననలను పొందారు.

ఆస్తి విషయమై అన్నపై తమ్ముడు కత్తితో దాడి

తోట్లవల్లూరు: ఆస్తి పంపకాల విషయమై జరిగిన గొడవలో అన్నపై తమ్ముడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కళ్లం పోతురెడ్డి, కళ్లం సుధాకర్‌రెడ్డి అన్నదమ్ములు. వీరి తండ్రి నాగిరెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ఈ పొలం పంచుకునే విషయంలో గత రెండు నెలలుగా అన్నదమ్ముల మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇరువురి మధ్య వివాదం రాజుకోవడంతో పోతురెడ్డిపై సుధాకర్‌రెడ్డి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో పోతురెడ్డికి పొట్టభాగంలో గాయమైంది. అతడ్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు పోతురెడ్డి స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జీ రమేష్ తెలిపారు.

ప్రత్తిపాడులో పంట బోదె పనులు

మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో పంటబోదె పనులు శుక్రవారం 49 మంది ఉపాధి కూలీలు చేశారని ఇన్‌చార్జి ఏపీఓ ఎస్.నవీన్ తెలిపారు. ఈ పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని శిబిర కన్వీనర్ పామర్తి నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు జరిగే శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యులు కుప్పా రామశాస్త్రి, పి. సురేష్, చంద్రారెడ్డి, రావి శ్రీనివాసరావు, డీఆర్కే ప్రసాద్, పి. పద్మావతి, శంకరానంద్ పాల్గొని వైద్య సేవలు అందిస్తారని చెప్పారు.

నేడు ఆలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

తలగడదీవి(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన కోదండ రామాలయం పునర్నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, కోశాధికారి చిట్టా శివ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 150 సంవత్సరాల నాటి ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టామన్నారు. శనివారం ఉదయం 8.30 గంటలకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించండి

మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్

పెడన: గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వెంటనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఆర్డీఓ ఐ. కిషోర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పెడన పట్టణంతో పాటు మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ సిబ్బందితో పాటు గృహ నిర్మాణ శాఖాధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఆర్డీఓ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంకా గృహ నిర్మాణాలు చేపట్టకపోతే మీరు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఎందుకు ముందుకు రావడం లేదో తెలుసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారి జాబితాలను తయారు చేసి వారి నుంచి లిఖిత పూర్వకంగా ఇంటిని నిర్మించుకోలేమనే విషయాన్ని లెటర్ రూపంలో తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇళ్లు నిర్మించుకుంటామని ముందుకు వచ్చే వారికి స్థలాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పెడన తహసీల్దార్ పి. మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, హౌసింగ్ డీఈ ఎ. శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి, హౌసింగ్ ఏఈలు రామచంద్రన్, మాధవి, వెలుగు ఏపీఎం శ్రీదేవి, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ కిషోర్

లఘు చిత్ర ప్రదర్శన



మండవల్లి గ్రంథాలయంలో లఘు చిత్రం ప్రదర్శింపజేస్తున్న గ్రంథాలయాధికారి పర్వీన

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పిల్లలకు బెస్ట్ మూవీ అయామ్ కలాంను చూపించారు. ఈ మూవీ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులతో పాటు నామినేషన్‌కు సెలెక్టయినట్టు ఆమె పేర్కొన్నారు. పేద విద్యార్థి తన ఆర్థిక పరిస్థితిని అధిగమించి ఏవిధంగా తన స్కూల్ లైఫ్ ప్రారంభించాడన్న అంశం ఈ చిత్రలో కళ్లకు కట్టినట్లు వివరించారని తెలిపారు.

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చదవడం అంటే నాకిష్టం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు టి ప్రవల్లిక, పి శాంతి, వి సునీత పాల్గొన్నారు.



విద్యార్థులతో కథలు చదివిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

విద్యార్థులకు నీతి కథల బోధన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శుక్రవారం నీతి కథలు చెప్పినట్టు లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి తెలిపారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న నీతికథల పుస్తకాల గురించి విద్యార్థులకు తెలియజేస్తూ నిత్యం వీటిని పఠనం చేయాలని శ్రీదేవి సూచించారు. ఉపాధ్యాయుడు జె.బాబురావు ఇంగ్లిషు గ్రామర్‌ను బోధించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

5న మడ మొక్కల పెంపకం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: అటవీ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిలకలదిండి సముద్రతీర ప్రాంతంలో తీరప్రాంత నివాసాలు, ప్రత్యక్ష ఆదాయాల కోసం మడ అడవుల ఏర్పాటు (మస్తీ) కార్యక్రమంలో భాగంగా మడ మొక్కలు నాటే కార్యక్రమం ఈ నెల 5వ తేదీన ప్రారంభిస్తామని జిల్లా అటవీ శాఖాధికారి కె. రాజశేఖరరావు శుక్రవారం తెలిపారు. తన కార్యాలయంలో విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈనెల ఐదో తేదీ ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి కలెక్టర్ పి. రాజాబాబు, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, నాయకులు, అధికారులు పాల్గొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మస్తీ కార్యక్రమంలో భాగంగా ఐదు హెక్టార్లలో మడ మొక్కల పెంపకం కార్యక్రమం చేపడతామన్నారు. మచిలీపట్నం, కానూరు ప్రాంతంలో మడ అడవి ఉందని, అక్కడక్కడా ఖాళీ స్థలాలు ఉన్నాయని, ఈ స్థలాల్లో కూడా మడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. గ్రీన్ క్లయిమెట్ ఫండ్ (జీసీఎఫ్) నిధులతో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటామని, రానున్న రోజుల్లో ఈ మొక్కలను నాటే కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

కమనీయం.. వెంకన్న కౌతుకోత్సవం

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కౌతుకోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ యాగశాలలో ప్రత్యేక హోమాలు చేశారు. కోడూరుకు చెందిన వెంకట రామకృష్ణప్రసాద్ (చిన్ని), రేపల్లెకు చెందిన మురళీకృష్ణ–ప్రియాంక దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కౌతుకోత్సవాన్ని జరిపారు. నవకలశ స్నపన ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక జలాలలో స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. గర్భాలయంలోని మూలమూర్తులకు వివిధ రకాల పుష్పాలతో చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. గురువారం రాత్రి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి వారి దేవాలయం స్వామి వారి రాయబారోత్సవాన్ని నిర్వహించారు. ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి వ్యాఖ్యాతగా వ్యవహరించి స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరించారు. శుక్రవారం రాత్రికి జరగాల్సిన కల్యాణాన్ని అనివార్య కారణాల వల్ల శనివారం రాత్రికి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



కౌతుకోత్సవం నిర్వహిస్తున్న పండితులు, ఉభయ దాతలు

కనుల పండువగా స్వామివారి కల్యాణం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి, రామలింగేశ్వరస్వామి వార్ల కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. తమ్మన సోమశేఖర పవన్‌కుమార్, కృష్ణవేణి, గమిడి సునీల్‌కుమార్, హారిక దంపతులు పీటలపై కూర్చున్నారు. సామా కుమారి భక్తబృందం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. అలాగే పర్వత వర్ధిని, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో దేసు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, నీరజ, కోట నాగవెంకట జయరాం, శ్రీదుర్గ దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆంజనేయ స్వామి పర్యవేక్షించారు.

రక్తసేకరణలో జాగ్రత్తలు పాటించాలి

గన్నవరం రూరల్: దాతల నుంచి రక్తం సేకరించేటప్పుడు డ్రగ్ అండ్ కాస్మెటిక్ చట్టం ప్రకారం అన్ని జాగ్రత్తలు పాటించాలని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు చెప్పారు. కళాశాలలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీసాక్స్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న రాష్ట్ర స్థాయి ప్రభుత్వ బ్లడ్ సెంటర్‌ల స్టాఫ్ నర్సుల అవగాహన సదస్సు లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 43 ప్రభుత్వ సెంటర్ల స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బ్లడ్ ఎక్కించే ముందు ఇన్ఫెక్షన్లు పరిశీలించుకోవాలని చెప్పారు. ఏపీ సాక్స్ జేడీ డాక్టర్ కిషోర్ పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్ఓడీ డాక్టర్ నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాస్మిన్ సుల్తానా, ప్రణీత్ పాల్గొన్నారు.



స్టాఫ్ నర్సులతో కళాశాల డీజీ డాక్టర్ సి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రంగారావు తదితరులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ వెంకట్రావ్

గుడివాడరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ వెంకట్రావ్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ డీటీ సుందరరావు అధ్యక్షతన శుక్రవారం డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బందికి సబ్సిడీ రుణ మంజూరుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను పొంది పరిశ్రమలు, కంపెనీలు స్థాపించి పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రుణాల మంజూరు విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే తమ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమలు స్థాపించేందుకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్, సిబ్బంది, వెలుగు ఏపీఎం దోమతోటి సాంబశివరావు పాల్గొన్నారు.

10న నాగపట్నానికి ప్రత్యేక బస్ సర్వీస్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10వ తేదీ వేళాంగిణి(నాగపట్నం)కు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం పి.శివాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం నాగపట్నం చేరుకుని వేళాంగిణి మాత దర్శనం, దివ్యబలిపూజ తర్వాత రాత్రి అక్కడే బస ఉంటుందని తెలిపారు. తిరిగి 12వ తేది ఉదయం నాగపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం చెన్నైకు చేరుకుని సెయింట్ థామస్ సమాధి సందర్శన, అదే రోజు మెరీనా బీచ్ సందర్శన తర్వాత రాత్రికి బయలుదేరి 13వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటుందని వివరించారు. యాత్ర టికెట్ ధర రూ. 3,400గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర సమాచారానికి 8790996090, 7382905633 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

మండవల్లి: శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే ఫ్లెక్సీలు తొలగించాలని ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. ఫ్లెక్సీల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. పంచాయతీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇనాం భూముల సాగుదారుల సమస్యలు పరిష్కరిస్తాం

గుడివాడ ఆర్డీఓ పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వెంకటాపురం ఇనాం భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. బాపులపాడు మండలం సిరివాడలో వెంకటాపురం ఇనాం భూముల సాగుదారులతో రెవిన్యూ అధికారులు శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలంగా ఇనాం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూములు సాగు చేస్తున్న పేద రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఆర్డీవో పద్మావతికి విజ్ఞప్తి చేశారు. బాపులపాడు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, తదితరులు పాల్గొన్నారు.